ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
మంగళవారం | అక్టోబరు 06, 2026 | సంపుటి : 7 | సంచిక : 107 | పేజీలు : 2

మూడు డిమాండ్లపై
# రాజీపడే ప్రసక్తే లేదు



కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి
- ఎస్ఐఆర్‌ను రద్దు చేయాల్సిందే
- ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్

**ఢిల్లీ, ఆయుధం:** ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన మూడు అంశాలపై కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని మరింత స్పష్టం చేసింది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) రద్దు, ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించడం, ఆ మూడు డిమాండ్ల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. వీటిని పార్టీ రాజీ లేని డిమాండ్లుగా పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఈ మూడు అంశాలపై కాంగ్రెస్ కార్యకర్తలు, ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలు ఆందోళనలు చేస్తున్నాయని ఖర్గే తెలిపారు. ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన అంశాలపై పోరాడుతున్న పౌర సమాజ సభ్యులు, యువజన సంఘాలకు కూడా కాంగ్రెస్ మద్దతుగా నిలుస్తుందని చెప్పారు.

### మూడు డిమాండ్లపై స్పష్టత

ఎక్స్‌లో ఖర్గే సోమవారం చేసిన పోస్టులో కాంగ్రెస్ డిమాండ్లను వరుసగా ప్రస్తావించారు. మొదటగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రెండోది ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరారు. మూడోది ఇకపై ఎన్నికలను బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించాలని పేర్కొన్నారు. ఆ మూడు అంశాలపై దేశవ్యాప్తంగా తమ పార్టీ, ఇండియా కూటమి భాగస్వామ్యాలు ఉద్యమిస్తున్నాయని ఖర్గే చెప్పారు. వివిధ ప్రాంతాల్లో ఇదే అంశాలపై ఆందోళనలు చేస్తున్న పౌర సమాజం, యువజన సంఘాలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని వెల్లడించారు.

### దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపు

మూడు డిమాండ్లపై ఇండియా కూటమి కూడా ఇప్పటికే ఉమ్మడి వైఖరిని ప్రకటించింది. సెప్టెంబర్ 30న న్యూఢిల్లీలో జరిగిన కూటమి సమన్వయ సమావేశం తర్వాత ఖర్గే మూడు ప్రధాన డిమాండ్లను వెల్లడించారు. అక్టోబర్ 2 నుంచి 8 వరకు జిల్లా స్థాయిలో సేవ్ డెమోక్రసీ మార్చ్ నిర్వహించాలని కూటమి నిర్ణయించింది. అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయం వైపు మార్చ్ నిర్వహించనున్నారు. అక్టోబర్ రెండో వారంలో ప్రతిపక్ష నేతలు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసి ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన అంశాలను ప్రస్తావించనున్నట్లు ఖర్గే అప్పట్లో తెలిపారు.

# చీతాలు @ 60

- కునో జాతీయ పార్కులో మరో 5 కూనల జననం..
- ఎక్స్ వేదికగా కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ వెల్లడి



భారత్ చేపట్టిన 'ప్రాజెక్ట్ చీతా'లో మరో ముందడుగు. మన దేశంలోనే జన్మించిన 32 నెలల చీతా (KGP21).. మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కులో అయిదు కూనలకు జన్మనిచ్చింది. కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ ఈ విషయాన్ని 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. దీంతో దేశంలో మొత్తం చీతాల సంఖ్య 60కు చేరినట్లు తెలిపారు. ఇందులో 41 చీతాలు భారత్‌లోనే జన్మించాయని చెప్పారు.
"భారత్‌లోనే పుట్టి.. కూనలకు జన్మనిచ్చిన చీతాల్లో ముఖి, కేజీపీ12 తర్వాత కేజీపీ21 మూడోది. ఈ అయిదు కూనల తండ్రి ఆఫ్రికాలోని బోట్స్‌వానాకు చెందిన మగ చీతా. దీంతో భారత్‌లోనూ బోట్స్‌వానా వంశక్రమం మొదలైంది. ప్రాజెక్టు చీతాలో భాగమైన వెటర్నరీ వైద్యులు, క్షేత్రస్థాయి సిబ్బంది, నిర్వాహకులకు అభినందనలు" అని భూపేందర్ యాదవ్ పేర్కొన్నారు. తొలిసారి 2022 సెప్టెంబరు 17న నమీబియా నుంచి తెచ్చిన ఎనిమిది చీతాలను ప్రధాని మోదీ.. కునో నేషనల్ పార్కులో వదిలారు.

జాతీయం, ఆయుధం:



ఫోన్ ట్యాపింగ్ కేసు..

## కోదండరెడ్డిని విచారించిన సిట్

ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత కోదండరెడ్డిని సిట్ అధికారులు విచారించారు. ఆయన కార్యాలయానికే వెళ్లి, దాదాపు 40 నిమిషాలకుపైగా వివిధ అంశాలపై ప్రశ్నించి, స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఆయన పేరు వెలుగులోకి రావడంతో ఇటీవల సిట్ అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. 2023 ఎన్నికల సమయంలో ఆయన ఫోన్ కొన్ని నెలలు ట్యాప్ అయినట్లు గుర్తించారు.



# సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను తొలగించాలి

## ఇండియా కూటమి ప్రజాస్వామ్య పరిరక్షణ శంఖారావం

- అంబేద్కర్ సెంటర్ నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ
- పాల్గొన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సిపిఐ, సిపిఎం నాయకులు, కార్యకర్తలు



**హనుమకొండ, ఆయుధం:** జాతీయ స్థాయిలో ఇండియా కూటమి ఇచ్చిన పిలుపు మేరకు హనుమకొండ జిల్లా కేంద్రంలో ఇండియా కూటమి పార్టీలు శంఖారావం పూరించాయి. సోమవారం రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం తన గుప్పిట్లోకి తీసుకుని ఓట్ల అక్రమాలకు పాల్పడుతోందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో భాగంగా అంబేద్కర్ సెంటర్ నుండి హనుమకొండ కలెక్టరేట్ వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ పాదయాత్ర చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాల ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కుడా చైర్మన్ గుండు సుధారాణి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఎం జిల్లా జి. ప్రభాకర్ రెడ్డి, న్యూ డెమొక్రసీ, తెలంగాణ జన సమితి జిల్లా నాయకులు నున్నా అప్పారావు, చిల్లా రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇండియా కూటమి నాయకులు కలిసి కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్లకార్డులతో నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట సర్ ప్రక్రియ పేరుతో కోట్లాది మంది ఓట్లు అక్రమంగా తొలగించిన కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కె.ఆర్.నాగరాజు

...: తరువాయి 2లో..)

దళారులను నమ్మి
## మోసపోవద్దు

- వరంగల్ డీఎంహెచ్‌వో డా.బి.రాజారెడ్డి



2 లో



# కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు మంచివి..
## ఓడిపోతే కాదా?: రామచందర్‌రావు

**హైదరాబాద్, ఆయుధం:** నెహ్రూ కుటుంబంలోని వ్యక్తి ప్రధాని కావడంలేదని కాంగ్రెస్ నేతలు ఓర్వలేకపోతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. అందుకే బీజేపీ అక్రమంగా గెలుస్తోందని నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు చెప్పినట్లుగా ఎన్నికలు అక్రమంగా జరిగితే.. సీఎం రేవంత్ రెడ్డి కూడా చట్టవిరుద్ధంగా గెలుపొందారని, ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేరళ, హిమాచల్ ప్రదేశ్ సీఎంలనూ రాజీనామా చేయించాలని సవాల్ విసిరారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు.
"గతంలో కేసీఆర్ కుటుంబం, ఇప్పుడు రేవంత్ బ్రదర్స్ బాగుపడుతున్నారు తప్పితే తెలంగాణ ప్రజలు మాత్రం బాగుపడడం లేదు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవు కానీ, ఢిల్లీకి మూటలు పంపడానికి ఉన్నాయా? మీరు గెలిస్తే ఈవీఎంలు మంచివి.. ఓడిపోతే మంచివి కాదా? తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తెచ్చుకుందాం'' అని రామచందర్‌రావు పిలుపునిచ్చారు.



2 లో

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



2 లో

ప్రజావాణి వినతులు
## పరిష్కరించాలి

- హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

విజయ డెయిరీ పాల ఉత్పత్తుల
## విక్రయ కేంద్రం ప్రారంభం



**హనుమకొండ, ఆయుధం:** హనుమకొండ బస్టాండ్ ఆవరణలో, అలాగే ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విజయ డెయిరీ పాల ఉత్పత్తుల కేంద్రాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తుల కేంద్రంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల ఉత్పత్తులను వారు పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన పాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడంలో విజయ డెయిరీ కీలక పాత్ర పోషిస్తోందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ప్రజలకు, ముఖ్యంగా బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు, ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారి సహాయకులు, సిబ్బందికి విజయ డెయిరీ ఉత్పత్తులు సులభంగా అందుబాటులో ఉండేలా ఈ కేంద్రాలను ఏర్పాటు చేయడం ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో నాణ్యమైన పాల ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేయడంతో పాటు, వినియోగదారులకు సౌకర్యవంతమైన ప్రదేశాల్లో విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా విజయ డెయిరీ ఉత్పత్తులకు మరింత ఆదరణ లభించే అవకాశం ఉందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా విజయ డెయిరీ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ డీడీ ధనరాజ్. జీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకమండలి సభ్యులు ఈవి శ్రీనివాసరావు, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## మహిళలు, ప్రయాణికుల భద్రతకు భరోసా

- పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఐపీఎస్
- "అభయ–మై ట్యాక్సీ సేఫ్" యాప్ ఆవిష్కరణ




**హనుమకొండ, ఆయుధం:** మహిళలు, ప్రయాణికుల భద్రతకు మరింత భరోసా కల్పించే లక్ష్యంతో , రూపొందించిన "అభయ-మై ట్యాక్సీ సేఫ్" యాప్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూరానున్న రోజుల్లో ప్రయాణికులు "అభయ-మై ట్యాక్సీ సేఫ్" స్టిక్కర్లు అంటించి ఉన్న టాక్సీ వాహణాల్లో మాత్రమే ప్రయాణిస్తారని తెలిపారు. "అభయ-మై ట్యాక్సీ సేఫ్" స్టిక్కర్లను ప్రతి ఆటో మరియు టాక్సీ డ్రైవర్లు తప్పనిసరిగా అంటించుకోవాలని, టాక్సీ పైన ఉన్న స్టిక్కర్ ను చూడగానే ప్రయాణికులకు నమ్మకం కలుగుతుందని, ప్రతి ఆటో, క్యాబ్ యజమానులు వారి టాక్సీ వివరాలను "అభయ-మై ట్యాక్సీ సేఫ్" యాప్ లో నమోదు చేసుకొని, సమీప ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో సంప్రదించి, స్టిక్కర్ లను పొంది, వారి టాక్సీ వాహనాలకి అంటించుకోవాలని తెలిపారు. ట్యాక్సీ డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రయాణికుల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం అని తెలిపారు. ఈ సందర్భంగా ట్యాక్సీ డ్రైవర్లకు యాప్ వినియోగం, ప్రయాణికుల భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ట్యాక్సీ వాహనాల్లో ప్రయాణించే మహిళలు, ఇతర ప్రయాణికులు కూడా "అభయ-మై ట్యాక్సీ సేఫ్" యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్యాక్సీ వాహనాలపై ఏర్పాటు చేసిన స్టిక్కర్ల ద్వారా ప్రయాణికులకు యాప్‌పై అవగాహన కల్పించడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న భద్రతా సదుపాయాలను వినియోగించుకునేలా ప్రోత్సహించనున్నారు. అలాగే నాటక ప్రదర్శన ద్వారా పోలీసు కళాబృందం వారు ట్రాఫిక్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీ (అడ్మినిస్ట్రేషన్) రాయల ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లు సుజాత, వెంకన్న, ట్రాఫిక్ సిబ్బంది, టాక్సీ డ్రైవరులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలి

(మొదటి పేజీ తరువాయి..)
మాట్లాడుతూ స్వయంప్రతిపత్తి కలిగిన ఎన్నికల కమిషన్ వ్యవస్థను కేంద్రంలోని అధికార పార్టీ తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాలరాసేలా జరుగుతున్న అక్రమాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో ఎన్నికల సంఘం విఫలమైందని మండిపడ్డారు. దేశంలో స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలు జరగాలంటే ప్రస్తుత ఎన్నికల ప్రధాన అధికారి తప్పుకోవాలని స్పష్టం చేశారు. మొదట ఈడీ, సీబీఐని ఉపయోగించి ప్రతిపక్ష నాయకులను బిజెపిలో చేర్చుకున్నారని, నేడు ఓట్ చోరీకి పాల్పడుతూ అక్రమంగా ఎన్నికలలో గెలవాలని చూస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికలలో ఓట్ చోరీపై నోరు మెదపడం లేదని అన్నారు.సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, అర్హులైన సామాన్యుల,



పేదల ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నదని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్నిఅపహాస్యం చేస్తున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.గతంలో మాదిరిగా సీఈసీ ఎంపిక ప్రక్రియలో చీఫ్ జస్టిస్ ను భాగస్వామ్యం చేయాలన్నారు. తొలగించిన ప్రతి ఒక్క ఓటును వెంటనే పునరుద్ధరించాలని, అలాగే వివాదాస్పదంగా మారిన ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.సిపిఎం జిల్లా కార్యదర్శి జి. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఇండియా కూటమి పోరాటంతో ఇప్పటికే రెండు విజయాలు సాధించామని, సీఈసీ ని తొలగించే వరకూ పోరాడి మరో విజయం సాధించాలని అన్నారు. సీఈసీ ని ఉపయోగించుకునే మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసే వరకు ఇండియా కూటమి దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తాయని హెచ్చరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ మేరా కోఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మన్ సంగ వెంకట్రాజం, కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్, వరంగల్ పార్లమెంట్ ఇంచార్జ్ దుద్దిళ్ల శ్రీను బాబు, డిసిసి మీడియా, కమ్యూనికేషన్ కమిటీ ఛైర్మన్ మార్క విజయ్ కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, నాయకులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, సిపిఎం జిల్లా నాయకులు ఎస్. వాసుదేవ రెడ్డి,గొడుగు వెంకట్, టి. ఉప్పలయ్య, చక్రపాణి, కమలాపూర్ ఏఎంసీ ఛైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్, వరంగల్ మార్కెట్ ఛైర్మన్ పులి ప్రియాంక, పరకాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజీ రెడ్డి, టీపీసీసి సభ్యులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఈ.వి. శ్రీనివాస్ రావు, బత్తిని శ్రీనివాస్, కూచన రవళి, మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి, దొమ్మటి సాంబయ్య, శ్రీనివాస్ గౌడ్, డీబీఎఫ్ నాయకులు చుంచు రాజేందర్ పాల్గొన్నారు.

---

## డిగ్రీ అర్హత ఉన్న పెన్షనర్లందరూ ఎమ్మెల్సీ
# ఓటు నమోదు చేసుకోవాలి

- ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం
- టాప్రా జిల్లా అధ్యక్షులు పరికిపండ్ల వేణు



**హనుమకొండ, ఆయుధం:** అర్హులైన పెన్షనర్ పట్టభద్రులందరూ రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తమ ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు పరికిపండ్ల వేణు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అని, ప్రతి అర్హత కలిగిన పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ముందుగానే ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేరు ఉన్నప్పటికీ, కొత్తగా రూపొందించే ఓటరు జాబితా కోసం ప్రతి అర్హుడూ Form18 ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి, గత జాబితాలో పేరు ఉన్నదనే కారణంతో కొత్తజాబితాలో పేరు స్వయంచాలకంగా కొనసాగుతుందని భావించకూడదు.అందువల్ల అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నవంబర్ 6వ తేదీలోపు Form18 ద్వారా ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు, ఓటర్ నమోదులో ఏర్పడే ఇబ్బందులకు జిల్లా శాఖను సంప్రదించాలని ఆయన కోరారు.

---

# దళారులను నమ్మి మోసపోవద్దు

- డీఎంహెచ్ఓ డా. బి. రాజా రెడ్డి



**వరంగల్, ఆయుధం:** ఉద్యోగ నియామకాల విషయంలో వదంతులు, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, దళారులను ఆశ్రయించి డబ్బులు చెల్లించి మోసపోవద్దని వరంగల్ డీఎంహెచ్‌వో డా.బి.రాజారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమిషనర్, వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ, హైదరాబాద్ వారి సర్క్యులర్ మేరకు జాతీయ ఆరోగ్య మిషన్ (NHM) పరిధిలోని వివిధ పోస్టులను కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనల ప్రకారం ఈ నెల 9 తేదీ సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నియామక ప్రక్రియను మెరిట్, రోస్టర్, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, విధానాల ప్రకారం పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు డిమాండ్ చేయడం లేదా తప్పుడు నియామక ఉత్తర్వులు చూపించడం వంటి విషయాలు తమ దృష్టికి వస్తే, సంబంధిత ఆధారాలతో అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అటువంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నుంచి ఎటువంటి నియామక నోటిఫికేషన్ జారీ కాలేదని, అలాగే ఈ కార్యాలయం ద్వారా ఎవరికీ నియామక ఉత్తర్వులు జారీ చేయలేదని డా. రాజా రెడ్డి స్పష్టం చేశారు.
సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి సంబంధించిన నియామకాలు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో ఉంటాయని తెలిపారు. ఈ విషయానికి సంబంధించి తమ కార్యాలయంలో ఎటువంటి ఫిర్యాదు నమోదు కాలేదని కూడా ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్లను మాత్రమే నమ్మాలని, అనధికార వ్యక్తులు, దళారుల మాటలు నమ్మి డబ్బులు చెల్లించి మోసపోవద్దని డీఎంహెచ్‌వో కోరారు.

---



## ప్రజావాణి దరఖాస్తులపై
# తక్షణ చర్యలు తీసుకోవాలి

- బల్దియా కమిషనర్ టి. వెంకన్న
- ప్రజావాణిలో 81 దరఖాస్తుల స్వీకరణ..

**వరంగల్, ఆయుధం:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం అందించడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అన్నారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి 81 దరఖాస్తులను స్వీకరించారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత విభాగాలకు అప్పగించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిగణించాలని, సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికీ తావివ్వరాదని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజలకు అందించే ప్రతి సేవలో పారదర్శకత, జవాబుదారీతనం, వేగం ఉండాలని సూచించారు. వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 81 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

### పెండింగ్ ఫిర్యాదుల పై ప్రత్యేక దృష్టి

గత వారం ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కార పురోగతిని కమిషనర్ విభాగాల వారీగా సమీక్షించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడంతో పాటు, తీసుకున్న చర్యలు, పరిష్కార వివరాలను సంబంధిత ఫిర్యాదుదారులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను కేవలం దరఖాస్తులుగా కాకుండా, పౌరుల సమస్యలకు పరిష్కారం అందించాల్సిన బాధ్యతగా అధికారులు భావించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం లేదా అనవసర జాప్యం చోటుచేసుకుంటే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని కమిషనర్ స్పష్టం చేశారు.

### బతుకమ్మ–దసరా పండుగలకు సమన్వయంతో ఏర్పాట్లు

ప్రజావాణి అనంతరం అధికారులతో కమిషనర్ మాట్లాడుతూ.. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గతంలో మాదిరిగా సమగ్ర ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. పండుగల నేపథ్యంలో ప్రజల రద్దీ, ప్రధాన కార్యక్రమాలు జరిగే ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, రహదారుల మరమ్మతులు, వెలుగుల ఏర్పాటు తదితర మౌలిక సదుపాయాలను ముందస్తుగా సిద్ధం చేయాలని సూచించారు. అన్ని విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, పండుగల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలు పండుగలను ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకునేలా బల్దియా తరపున అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

### ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్ వేగవంతం చేయాలి

ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ప్రక్రియను సమన్వయంతో చేపట్టి, పెండింగ్ లేకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకం ప్రయోజనాలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సూపరింటెండింగ్ ఇంజినీర్ రాజ్‌కుమార్, డీఎఫ్ఓ శంకర్‌లింగం, సీహెచ్ఓ లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, సెక్రటరీ అనిల్‌బాబులతో పాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

---

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్
# గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలి..
- క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలి
- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**పరకాల, ఆయుధం:** వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను పార్టీ శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలని సూచించారు.
సోమవారం పరకాల పట్టణంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో చల్లా ధర్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో విజయం సాధించాలంటే ముందుగా అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడి ఓటరు నమోదు పూర్తయ్యేలా చూడాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి వార్డులోని పట్టభద్రులను గుర్తించి, వారిని సంప్రదించి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించి పట్టభద్రులకు ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. గతంలో పట్టభద్రుల ఓటరుగా నమోదైన వారు సైతం తాజా ఓటరు జాబితా కోసం మళ్లీ నమోదు చేసుకోవాల్సి ఉన్నందున ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని చల్లా ధర్మారెడ్డి సూచించారు. వార్డుల వారీగా నాయకులు బాధ్యతలు తీసుకుని నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ శ్రేణులంతా ఇప్పటి నుంచే సమన్వయంతో పనిచేయాలని, ప్రతి పట్టభద్రుడిని కలిసి ఓటరు నమోదుతో పాటు ఎన్నికల ప్రాధాన్యతను వివరించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేస్తూ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, యూత్ నాయకులు,క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు,వార్డు ఇంఛార్జీలు తదితరులు పాల్గొన్నారు.

---

# ప్రజావాణి వినతులు పరిష్కరించాలి

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ, ఆయుధం:** ప్రజావాణి కార్యక్రమం ద్వారా నమోదవుతున్న వినతుల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలపై అందించిన వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన అర్జీల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని, అదేవిధంగా జిల్లా కలెక్టరేట్ కు వచ్చిన అర్జీలను పరిష్కరించే చర్యలు చేపట్టాలని ఆర్డీవోలు, తహసిల్దార్లను కలెక్టర్ వర్చువల్ విధానం ద్వారా ఆదేశించారు. ప్రజావాణి అర్జీలలో వివిధ శాఖల వారీగా ఉన్న పెండింగ్ లో ఉన్నవాటిపై సమీక్ష చేసి త్వరగా పరిష్కారానికి చర్యలు చేపట్టడంపై అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో అందిన వినతుల పరిష్కారంలో అధికారులు జాప్యం చేయొద్దని పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న వినతుల పరిష్కారానికి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు.
ప్రతి జిల్లా కార్యాలయంలో ప్రత్యేకంగా ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కార బాధ్యతలు ఒకరికి అప్పగించాలన్నారు. ఆయా అప్లికేషన్లపై చర్యలు తీసుకున్న నివేదిక సమర్పించి అధికారులు వాటిని పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాగా ఆర్డీవో కార్యాలయాల్లో ఆర్డీవోలు ఇతర అధికారులు పాల్గొని ప్రజల నుండి అర్జీలను, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం తో పాటు హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 254 వినతులు అందాయి.
ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డిఆర్డిఓ మేన శ్రీను, ఇతర శాఖల జిల్లా అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

---

# కేడీసీలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం



**హనుమకొండ, ఆయుధం:** కాకతీయ ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి), హనుమకొండలో ఫ్యాకల్టీ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ ఐ.అజిత్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజశేఖర్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయుల మారుతున్న పాత్రపై అర్థవంతమైన చర్చకు అకాడమిక్ వేదికను ఏర్పాటు చేస్తున్న ఫ్యాకల్టీ ఫోరం కృషిని ఆయన ప్రశంసించారు. IQAC కోఆర్డినేటర్ ప్రొఫెసర్ శ్రీనాథ్ మాట్లాడుతూ.. విద్యార్థుల, సమాజ అవసరాలకు అనుగుణంగా బోధనా విధానాలను నిరంతరం మార్చుకుంటూ, ఆధునీకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.
ఫ్యాకల్టీ ఫోరం కన్వీనర్ అడమా శ్రీనివాస్ రెడ్డి ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహణ ప్రాధాన్యత, దాని నేపథ్యాన్ని వివరించారు. డిజిటల్, కృత్రిమ మేధస్సు యుగంలో ఉపాధ్యాయ వృత్తి స్వభావం వేగంగా మారుతున్న తీరును ఆయన వివరించారు.
ముఖ్య ప్రసంగం చేసిన ప్రొఫెసర్ ఐ. అజిత్ కుమార్ రెడ్డి వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం, ముఖ్యంగా కృత్రిమ మేధస్సు (AI) ఆవిర్భావం నేపథ్యంలో ఉపాధ్యాయుల పాత్రలో వస్తున్న మార్పులను విశదీకరించారు. సవివరమైన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానం బోధన, అభ్యసన ప్రక్రియలను ఏ విధంగా మారుస్తుందో వివరించారు. సంప్రదాయ తరగతి గది బోధనా విధానాలను అధిగమించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు.
ఈ సందర్భంగా ఫ్యాకల్టీ ఫోరం తరపున "Ordinary People and Extraordinary Teachers" అనే పుస్తకాన్ని ప్రొఫెసర్ అజిత్ కుమార్ రెడ్డికి అందజేసి సత్కరించారు. ఫ్యాకల్టీ ఫోరం సభ్యులు డా.యు. స్వామి ప్రార్థనా గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో డా. కిషోర్, డా.ఉగాందర్, డా.మహేందర్, డా.ఉమ, డా. రోహిణి, డా.శ్రీకాంత్, డా.ప్రసూన, డా.శ్రీనివాస్, డా.రమేష్, డా.కవిత తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.




---



## కార్యాలయ ఏర్పాటుకు స్థల పరిశీలన

**హనుమకొండ, ఆయుధం:** హనుమకొండ సుబేదారిలోని జిల్లా పరిషత్ కు సంబంధించిన స్థలం, శిథిలావస్థకు చేరిన భవనాలు, ఖాళీ ప్రదేశాలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సోమవారం పరిశీలించారు. హనుమకొండ తహసీల్దార్ కార్యాలయ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించే ప్రక్రియలో భాగంగా కలెక్టర్ స్థల పరిశీలన చేశారు. క్వార్టర్స్, ఖాళీ స్థలానికి సంబంధించిన వివరాలను జెడ్పీ సీఈఓ శేషాద్రి, డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు కలెక్టర్‌కు వివరించారు. అందుబాటులో ఉన్న ఖాళీ స్థలంను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

---

# ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ కు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలి

- తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా ఇన్చార్జ్ చింతకింది కృష్ణమూర్తి



**రఘునాథపల్లి, ఆయుధం:** రానున్న గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా పద్మశాలి ముద్దుబిడ్డ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ కు అవకాశం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా ఇన్చార్జి సీనియర్ జర్నలిస్టు చింతకింది కృష్ణమూర్తి పద్మశాలి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రానున్న గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా పద్మశాలి బిసి ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ కు అవకాశం కల్పిస్తే పద్మశాలిలకు న్యాయం సుముచిత స్థానం కల్పించినట్లు జరుగుతుందని ఆయన అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 171 (5) ప్రకారం సామాజిక రంగంలో ప్రత్యేక జ్ఞానం, లేదా అనుభవం ఉన్న వ్యక్తులను గవర్నర్ కోట ద్వారా శాసనమండలికి నామినేట్ చేయవచ్చు అని అన్నారు. జనాభాలో అత్యధిక స్థానంగా ఉన్న పద్మశాలి కులస్తులకు ఈ అవకాశాన్ని కల్పించి సరైన న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆయన విజ్ఞప్తి చేశారు.

---



# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల హోదాలు, వేతనాలను యథావిధిగా కొనసాగించాలి

**వరంగల్, ఆయుధం:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని వివిధ శాఖల్లో గత 25 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ప్రస్తుత హోదాలు, వేతనాలను యథావిధిగా కొనసాగించాలని, జీవో, ఆర్ఐఎన్ఓ 1181 ద్వారా ఏర్పడే వేతన కోతను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఏళ్ల తరబడి మున్సిపల్ కార్పొరేషన్‌లో సేవలందిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై వేతన కోత విధించడం అన్యాయమని అన్నారు. తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటూ విధులు నిర్వహిస్తున్న కార్మికుల జీవనోపాధిని దెబ్బతీసే నిర్ణయాలను ప్రభుత్వం, అధికారులు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ప్రస్తుత హోదాలు, వేతనాలను యథావిధిగా కొనసాగిస్తూ వారికి న్యాయం చేయాలని కోరారు. ధర్నా అనంతరం కార్మిక సంఘాల నాయకులు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ గౌరవ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ గౌరవాధ్యక్షులు ఏల్పుల ధర్మరాజు, ఏఐటీయూసీ అధ్యక్షులు వేల్పుల సారంగపాణి యాదవ్, ఐఎన్‌టీయూసీ గ్రేటర్ వరంగల్ అధ్యక్షులు పాశం రవి యాదవ్, బొక్క ఏలియా, సీఐటీయూ సంఘం ప్రధాన కార్యదర్శి జన్ను ప్రకాష్, బరుపట్ల మహేష్, కంప్యూటర్స్ మియాపురం శ్రీకాంత్, నరేష్, బహుజన సమాజ్ అధ్యక్షులు వక్కల రణసాగర్, ఓఎస్సీ జేఏసీ అధ్యక్షులు కొత్తకొండ శ్రీనివాస్, డ్రైవర్ల సంఘం అధ్యక్షులు మేకల దేవేందర్ యాదవ్, పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by V.P.CHANDER. On Behalf of VNR MEDIA. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695